శిథిలావస్థలో పశు వైద్యశాల


దుస్థితిలో పశు వైద్యశాల

తోటపల్లిగూడూరు: మండలంలోని మేజర్ పంచాయతీ కోడూరులోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. కోడూరుతో పాటు వెంకన్నపాళెం, కొత్తపాళెం, పోట్లపూడి, సౌత్ ఆములూరు, ముంగళదొరువు, చింతోపు, నరుకూరు, పేడూరు పంచాయతీలకు చెందిన పాడి రైతుల పశువులకు ఈ వైద్యశాల ద్వారానే సేవలందాల్సి ఉంది. దాదాపు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం నేడు అధ్వానంగా మారింది. వర్షాకాలంలో చిత్తడిగా మారుతోంది. వైద్యశాలలో నిల్వ ఉంచిన మందులు, ఇతర వైద్య పరికరాలు నీటిలో తడిచిపోతున్నాయి. భవన దుస్థితిపై ఉన్నతాధికారులకు పలుసార్లు విన్నవించినా, ప్రయోజనం కరువవుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏమరుపాటుగా ఉంటే అంతే..


సాలిపేట - మండపం సమీపంలో ప్రమాదకరంగా మలుపు


సాలిపేట - తోటపల్లిగూడూరు మార్గంలో ఇలా..

తోటపల్లిగూడూరు: మండలంలోని సాలిపేట - కాటేపల్లి.. సాలిపేట - తోటపల్లిగూడూరు మార్గాల మధ్య ఆర్ అండ్ బీ రహదారిలో ఉన్న పలు మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ రెండు ప్రాంతాల మధ్య ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సుమారు 20కుపైగా మలుపులున్నాయి. కాటేపల్లి శివాలయానికి రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. సాలిపేట దాటగానే రెండో కాలువ జంక్షన్ సమీపంలో గల మలుపు ప్రమాదభరితంగా మారింది. సాలిపేట నుంచి తోటపల్లిగూడూరుకు వెళ్లే రహదారిలో మాచర్లవారిపాళెం సమీపంలో ఉన్న మరో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయలేదు. ఉన్నతాధికారులు స్పందించి వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దెబ్బతిన్న కల్వర్టు


కల్వర్టుపై పోసిన చెత్త

పొదలకూరు: రాపూరు - పొదలకూరు మార్గంలోని డేగపూడిరాజుపాళెం సమీపంలో గల మెయిన్ రోడ్డుపై కల్వర్టు దెబ్బతినింది. దీంతో అక్కడ చెత్తాచెదారాన్ని వేసి రాళ్లు పెట్టారు. రాత్రివేళ ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఈ మార్గం మీదుగా నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. బస్సులు, లారీలు, టిప్పర్లు, ద్విచక్రవాహనాలు వెళ్తుంటాయి. ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

విశేషాలంకారంలో కన్యకాపరమేశ్వరి



పొదలకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శయ్యా అలంకారంలో దర్శనమిచ్చారు. ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. లలితా సహస్రనామార్చన, ఖడ్గమాల పూజలను జరిపారు.

యాంత్రీకరణతో వ్యవసాయం లాభసాటి

నెల్లూరురూరల్: యాంత్రీకరణను పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రైతులు, వ్యవసాయాధికారులు, బ్యాంకర్లతో వ్యవసాయ యాంత్రీకరణ గురించి జరిగిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ శనివారం పాల్గొని, మాట్లాడారు. వ్యవసాయాన్ని సుస్థిరమైన ఆదాయ వనరుగా మార్చేందుకు యాంత్రీకరణ ఆవశ్యకమన్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి, ఉత్పాదకత పెరిగి వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, సమయం, కూలీ ఖర్చులు అన్నింటిలో యాంత్రీకరణ ద్వారా మిగులు ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రదర్శించిన 60 రకాల యంత్రాలలో రైతులకు ముఖ్యంగా అవసరమయ్యే వాటిని వ్యవసాయాధికారులు గుర్తించాలన్నారు. త్వరలో నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి యంత్ర పరికరాల అవసరాలను గుర్తించాలన్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. రైతులు, బ్యాంకర్ల మధ్య ప్రభుత్వం వారధిగా ఉంటుందన్నారు. అనంతరం వరి పంటలో యూరియా వినియోగం గురించి ప్రత్యేకంగా తయారు చేసిన పోస్టర్‌ను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవతి, జిల్లా మత్స్య శాఖ అధికారి శాంతి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఆత్మ పీడీ మురళి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరగాలంటే కులగణనతోనే సాధ్యం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి అన్నారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో బీసీ కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన ఎక్కువగా ఉన్న బీసీలకు రానున్న స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నారే తప్ప వారికి దక్కాల్సిన సీట్లు, పదవుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఒక్క ఎమ్మెల్యే సీటు లేదని, జిల్లాలోని 38 మండలాల్లో మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పోరాటాలు చేసేందుకు రాజకీయాలకు అతీతంగా బీసీలను ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు కృషి చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించినట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు రమణయ్య, మాలకొండయ్య, వినోదిని, పమజుల దశరథ రామయ్య, రామరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు లీలామోహన్, ఏఐటీయూ నాయకుడు జిలానీఖాన్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మస్తాన్, ఏపీ మహిళా సంఘం నాయకురాలు వనజ, సోఫియా, సాయిలత, శిరీష, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, సీపీఐ ఎంఎల్ నాయకులు సాగర్, రామ్‌బాబు, బీసీ, వడ్డెర సంఘ నాయకులు నాగేశ్వరరావు, గుంజి దయాకర్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ప్రసన్న పరామర్శ


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దయాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రసన్న


కోవూరు: ప్రేమలతను పరామర్శిస్తున్న ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోగోలు దయాకర్‌రెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల దయాకర్‌రెడ్డి గుండెకు స్టంట్ వేయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి దయాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు షాహుల్, సతీష్‌రెడ్డి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు: పాటూరు ఎంపీటీసీ సభ్యుడు వంగవరపు విజయ్‌సేనారెడ్డి సతీమణి ప్రేమలత ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని, దామరమడుగులోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు లెక్కచేయని కార్పొరేట్ స్కూల్స్


మాట్లాడుతున్న అపస్మా నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్పొరేట్ పాఠశాలలు సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా టాలెంట్ టెస్టులు నిర్వహించడానికి సిద్ధమయ్యాయని జిల్లా అపస్మా సభ్యులు ఆరోపించారు. వారు పట్టణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో సుప్రీంకోర్టు ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి టాలెంట్ టెస్టులు నిర్వహించకూడదని ఆదేశాలిచ్చిందన్నారు. అయితే బుచ్చిలో కొందరు కార్పొరేట్ పాఠశాలలు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారని వాపోయారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కోవూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం అధ్యక్షుడు ఆయుర్‌ఖాన్, మల్లేశ్వర్‌రెడ్డి, మున్నా, మన్సూర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో పాఠ్యాంశ వీడియో రూపకల్పన


ఏఐ వీడియో పాఠ్యాంశాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం లక్ష్మీకాంతం

కొడవలూరు: గండవరంలోని ఉన్నత పాఠశాల హిందీ పండిట్ జి.నాగభూషణం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించి పాఠ్యాంశ వీడియోను రూపకల్పన చేశారు. ఎనిమిదో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలోని 'కుడేదాన్' పాఠ్యాంశాన్ని కృత్రిమ మేధతో యానిమేషన్ రూపంలో రెండు నిమిషాల్లోనే వీడియో రూపకల్పన చేశారు. దీనిని ఆ పాఠశాలలో హెచ్ఎం బి.లక్ష్మీకాంతం శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యను ఆకర్షణీయంగా సులభంగా మార్చడానికి ఇదొక వినూత్న ప్రయోగమన్నారు. ఈ వీడియోను యూట్యూబ్‌లో విడుదల చేయడం వల్ల అనేక మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రయోజనం పొందుతారన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ నాయకులు

కోవూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో కోవూరు పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక తాలూకా కార్యాలయం నుంచి ప్రారంభమై ర్యాలీ మందబయలు సెంటర్, బజార్ సెంటర్ మీదుగా సాగింది. అనంతరం బజార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ యాప్స్ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని, సీపీఎస్ విధానాన్ని విడనాడి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు మురళీకృష్ణ, చెంచురామయ్య, ఖాజావలీ, నాగిరెడ్డి, రమేష్, భారతి, విజయమ్మ, జమీర్ అహ్మద్, శ్రీనివాస ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకయ్య, పుట్టయ్య, బత్తల శ్రీనివాసులు, హెచ్ఎం ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మనుబోలు: పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని వీరంపల్లి, కాగితాలపూరు ఎస్టీ కాలనీల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేయాలో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, సీతాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రేవతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వాహన చోదకుడికి గాయాలు

వెంకటాచలం: ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని నిప్పో సెంటర్‌లో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరు మండలంలోని పంటపాళేనికి వెళ్లారు. తిరిగి బయల్దేరగా, సర్వేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. గాయపడిన సుబ్రహ్మణ్యాన్ని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గొలగమూడిలో భక్తుల పూజలు


మనుబోలు: విశేషాలంకారంలో వెంకయ్యస్వామి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్ద గల భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి భక్తులు శనివారం భారీగా తరలివచ్చారు. దీంతో ఆశ్రమ ప్రాంగణం కోలాహలంగా మారింది. స్వామివారిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ నిత్యాన్నదానశాలలో అన్న సంతర్పణ చేశారు.

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను నిర్వహించారు. పంచామృతాభిషేకం తదితరాలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. హోమగుండం వేసి ధుని పూజను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి వాణి

ముత్తుకూరు(పొదలకూరు): నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. ముత్తుకూరు మండలంలోని గోవిందరెడ్డిపాళెం ఎస్సీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళలను అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. ఇలాంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలనుకునే వారు 15100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కావలి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విక్రమసింహ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బయ్య, వీఆర్వో నారాయణ, పంచాయతీ సెక్రటరీ లెనిన్, సీడీపీఓ రాజ్యలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను నేత్రపర్వంగా జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు చెక్


మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు చెక్ పెట్టొచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ అన్నారు. మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జొన్నవాడ గిరిజన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది, డెంగీ, మలేరియా వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి దౌర్జన్యాలకు గుణపాఠం తప్పదు


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు

ఇందుకూరుపేట: కూటమి ప్రభుత్వం పాలనను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోందని, వారి దౌర్జన్యాలకు జగనన్న 2.0 ప్రభుత్వంలో తగిన గుణపాఠం తప్పదని రాష్ట్ర ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్, కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు కొండూరు అనిల్‌బాబు అన్నారు. ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఉన్న షాదీ మంజిల్‌లో వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ కూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ శనివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనిల్‌బాబు పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను పక్కన పెట్టి రెడ్ బుక్ పేరిట మన పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న కష్టాలు, ఇబ్బందులు, అవమానాలు ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేధింపులకు గురిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటారన్నారు. డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి అంశానికి సమాధానం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బట్టేపాటి నరేంద్ర, గునపాటి సురేష్‌రెడ్డి, బీవీ రమణయ్య, రూప్‌కుమార్‌రెడ్డి, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, నేతలు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డితో పాటు కోవూరు నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వివాదాస్పద రిజిస్ట్రేషన్‌పై రచ్చ

• కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన


కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు నిరసన చేస్తున్న తులసమ్మ, కుటుంబసభ్యులు


తులసమ్మ పట్టాదారు పాసు పుస్తకం

కోవూరు: కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరోసారి వివాదాస్పద రిజిస్ట్రేషన్ వెలుగు చూసింది. విడవలూరుకు చెందిన ఏనేటి తులసమ్మకు చెందిన భూమిని మోసం చేసి, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సహకారంతో ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తులసమ్మకు సుమారు 1.25 ఎకరాల భూమి ఉంది. ఆమెకు తరువాత మరికొందరు వారసులు ఉన్నారు. అయితే ఆమె మనుమడు ఏనేటి ఉరఫ్ వేనేటి సురేష్ ఇన్‌చార్జి ఎస్సార్ ఉదయగిరి శ్రీనివాసులుతో కుమ్మక్కై, పింఛన్ కోసం సంతకాలు అవసరం అని చెప్పి తులసమ్మను మోసం చేసి సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం డాక్యుమెంట్ నంబర్ 850/2025 కింద ఆ భూమిని సురేష్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా దీనిపై శనివారం తులసమ్మ కుటుంబ సభ్యులు కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. నా భూమికి సంబంధించిన పట్టాలు, డాక్యుమెంట్లు అన్నీ మా దగ్గరే ఉన్నాయి.. నాకు తెలియకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? మా పిల్లలందరికీ సమానంగా రావాల్సిన ఆస్తిని ఒక్కడి పేరుతో ఎందుకు చేశారు? అని తులసమ్మ ప్రశ్నించారు. భారీగా ముడుపులు తీసుకుని ఈ రిజిస్ట్రేషన్ జరిపారని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అక్కడ పనిచేసిన ఉదయగిరి శ్రీనివాసులు (ప్రస్తుతం కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్) బాధితులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన గవర్నర్‌కి చెప్పుకో, ముఖ్యమంత్రికి చెప్పుకో, పవన్ కళ్యాణ్‌కి, లోకేష్‌కు చెప్పుకోం, నన్నెవరూ ఏమీ చేయలేరంటూ వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

'నా స్కానర్ నాకివ్వు'

ప్రస్తుతం కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను స్కాన్ చేయడం తప్పనిసరి. అయితే సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాసులు ఆ స్కానర్ నాది, నా సొంత డబ్బులతో కొన్నది.. దానిని నేను తీసుకుపోతాను అంటూ శనివారం కార్యాలయం నుంచి స్కానర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో అనేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. స్కానర్ లేకపోవడంతో సిబ్బంది, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.